
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

3★★

సోమవారం 28 అక్టోబరు 2024

న్యూస్ బాక్స్

ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా వేణుగోపాల్

జగిత్యాల అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షునిగా సారంగాపూర్ మండలం బీర్‌పూర్ గ్రామానికి చెందిన అక్కిపెల్లి వేణుగోపాల్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు మైలారం లింబాద్రి ఆదివారం నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా నాయకులు గంప శ్రీనివాస్, శ్రీకాంత్, ధర్మపురి లక్ష్మీనృసింహ స్వామి ఆలయ చైర్మన్ రవీందర్, ధర్మపురి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కూరగాయల సంతోష్, సారంగాపూర్ అధ్యక్షుడు రాజన్న, మాజీ అధ్యక్షుడు రమేష్‌పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం విచారకరం

జగిత్యాల అర్బన్, అక్టోబరు 27: ఐదు వాయిదాల తరువత్యం పెండింగ్‌లో ఉండగా ఒక్క వాయిదా మాత్రమే విడుదల చేయడం విచారకరమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తులసి ఆగమయ్య ప్రభుత్వ నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన 15 రోజుల్లో బకాయిపడిన మూడు వాయిదాల డిజైన్ విడుదల చేస్తామని మేనిఫెస్టోలో అధికారంలోకి వచ్చిన తర్వాత పది నెలలక ఒక డీఏను ఇవ్వడం సరి కాదన్నారు.

పశు గణన షురూ..



పశుగణన వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

- భారత్ పశుదాన్ పేరిట ప్రత్యేక పోర్టల్
- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు
- రెవెన్యూ గ్రామం యూనిట్‌గా సర్వే
- జిల్లాలో 115 మంది ఎన్యుమరేటర్ల గుర్తింపు
- వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ల పర్యవేక్షణ

జగిత్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జనాభా లెక్కల మాదిరిగానే పశు సంవర్ధక శాఖ పశు గణన కార్యక్రమాన్ని చేపడుతోంది. ప్రతీ ఐదేళ్లకు ఒకమారు పశువులను లెక్కిస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుతం 21వ అఖిల భారత పశు గణనను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పశుసంపద అత్యంత కీలకమని కేంద్ర ప్రభుత్వ భావిస్తోంది. మానవ జీవన శైలిలో శాస్త్ర సాంకేతికంగా ఎంతో పురోగతి సాధించినప్పటికీ అధిక శాతం వ్యవసాయ అనుబంధ రంగంతో జీవనోపాధి పొందుతున్న అంశాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ప్రతి ఐదేళ్లకోసారి పశువుల గణన చేపడుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం 21వ అఖిల భారత జాతీయ పశుగణన కార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించింది. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, పట్టణాల్లో పశు గణను పశుసంవర్ధక శాఖ అధికారులు ప్రారంభించారు.

77 పశు వైద్యశాలలు

జిల్లాలో మొత్తం 77 పశు వైద్యశాలలు ఉన్నాయి. వాటిలో రెండు ఏరియా వెటర్నరీ వైద్యశాలలు (ఏవీహెచ్), 30 ప్రైమరీ వెటర్నరీ వైద్యశాలలు (పీవీసీ), 45 పశు సబ్ సెంటర్లు ఉన్నాయి. వీటికి తోడు జిల్లాలో మూడు సంచార పశు వైద్య శాలలు పనిచేస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా మంజూరైన 194 వివిధ స్థాయిల సిబ్బందికి గాను సుమారు 115 మంది పనిచేస్తున్నారు. ఆయా పరిధిలో ఉన్నతాధికారులు ఎంపిక చేసిన సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్ల ఆధ్వర్యంలో ఈ పశుగణన చేపట్టనున్నారు. జిల్లాలో సుమారు 6,51,225 గొర్రెలు, సుమారు 1,19,299 గోజాతి పశువులున్నట్లు అంచనా ఉంది. రెవెన్యూ గ్రామం యూనిట్‌గా పశు గణనను జరుపుతున్నారు. పశుగణన డిజిటల్ ప్లాట్ ఫారమ్ (భారత్ పశుదాన్ పోర్టల్)లో పశుగణన సమాచారాన్ని పొందుపరుస్తున్నారు. జిల్లాలో 287 రెవెన్యూ గ్రామాలతో పాటు పట్టణాల్లో గల 134 వార్డులలో 115 మంది ఎన్యుమరేటర్లను గుర్తించి పశుగణన జరుపుతున్నారు. ఎన్యూ మరేటర్ల పనితీరు ను మండల స్థాయిలో సూపర్ వైజర్లు పర్యవేక్షిస్తున్నారు. ఇందుకు మండలానికి చెందిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌లకు బాధ్యతలు అప్పగించారు.

తరువాయి 6వ పేజీలో..

కార్మికుల సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు

- జిల్లా కార్మిక శాఖ అధికారి, యం సురేందర్ కుమార్

ముఖాముఖి

జగిత్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కార్మికుల సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని జగిత్యాల జిల్లా కార్మిక శాఖ అధికారి, యం. సురేందర్ కుమార్ తెలిపారు. జిల్లాలోని జగిత్యాల, మెట్‌పల్లి సహాయ కార్మిక శాఖ కార్యాలయ పరిదిలో భవన నిర్మాణ కార్మికులు, దుకాణాలు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న వ్యక్తుల నమోదుతో పాటు సంక్షేమానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.


జిల్లా కార్మిక శాఖ అధికారి, యం. సురేందర్ కుమార్

ఆంధ్రజ్యోతి : జిల్లా వ్యాప్తంగా ఎంత మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు..అందులో పురుషలు, మహిళలు ఎంత మంది..?

అధికారి : జిల్లా వ్యాప్తంగా 72,981 మంది భవన నిర్మాణ కార్మికులు న్నారు. ఇందులో 41,204 మంది పురుషులు, 31,777 మంది స్త్రీలున్నారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా కార్మికుల నమోదును నిర్వహిస్తున్నాము.

ఆంధ్రజ్యోతి : కార్మికుడిగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవడానికి ఏమైనా రుసుము చెల్లించాలా..?

అధికారి : మీ సేవా కేంద్రంలో గానీ, ఆన్‌లైన్ ద్వారా గానీ కార్మికుడిగా నమో దు చేసుకునే అవకాశాలున్నాయి. రూ. 110 రుసుమును విధిగా చెల్లించాల్సి ఉంటుంది.

ఆంధ్రజ్యోతి : కార్మికుల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలు ఏమిటి..?

అధికారి : భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి అనేక పథకాలు అమలులో ఉన్నాయి. అందులో వివాహ కానుక, ప్రసూతి సాయం, సా ధారణ మరణం పొందిన వారికి ఆర్థిక సహాయం, ప్రమాదం వల్ల చనిపోతే ఆ ర్థిక సహాయం, కార్మికుడికి దహన సంస్కారాల ఖర్చులకు సహాయం, ప్రమాదం వల్ల అంగ వైకల్యం గురైతే సహాయం తదితరాలున్నాయి.

మిగతా 6లో

సెకండ్ హ్యాండైనా.. కొనేద్దాం

- మార్కెట్‌లో యూజ్‌డ్ కార్లకు డిమాండ్
- కొత్త వాటితో పోలిస్తే పాతిక శాతం ధరల్లోనే లభ్యం
- మక్కువ చూపుతున్న మధ్య తరగతి వర్గాలు


అమ్మకానికి సిద్దంగా ఉన్న కార్లు

5

నత్తనడకన ఆలయ అభివృద్ధి పనులు

- వివిధ పనులకు నిధుల మంజూరు
- 35.17 కోట్ల పనులు రద్దు చేసిన ప్రభుత్వం


ధర్మపురిలో కొనసాగుతున్న 60 గదుల నిర్మాణం

6

అంకితభావంతో పని చేయండి

జగిత్యాల అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నూతనంగా విధుల్లోకి వచ్చిన ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దామోదర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం డీఎస్సీ 2024 నూతన ఉపాధ్యాయుల సమ్మేళనం విద్య సదస్సును నిర్వహించారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి ప్రభుత్వ పాఠశాలల మనుగడకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మంగ మహేందర్ రెడ్డిని గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోయినిపెల్లి ఆనంద రావు, ఏళ్ల అమర్‌నాథ్ రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, సురేఖ, జయప్రద, శశికళ, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులే సమాజ సేవకులు

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్


పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జగిత్యాల అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులు నిజమైన సమాజ సేవకులని, వారిపై చిన్నచూపు తగదని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల పట్టణంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికుల వల్లనే పట్టణం పరిశుభ్రం, పచ్చదనంతో కలకలలాడుతుందని, పారిశుధ్య కార్మికులు సమాజంలో అంతర్భాగమని అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్మికుల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని, అలాగే పేదల కోసం ఉచిత వైద్యం చేసేందుకు ఐఎంఏ ముందుకు రావాలని కోరారు. ఐఎంఏ ఆధ్వర్యంలో ఉచిత క్యాంపుల నిర్వహణకు ఒక కమిటీ వేయాలని ఆయన సలహా ఇచ్చారు. ఈ వైద్య శిబిరంలో 9 విభాగాల్లో 45 మంది వైద్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, జిల్లా వైద్యాధికారి సమీయొద్దీన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు గూడూరి హేమంత్, కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్, కోశాధికారి సుధీర్, రామకృష్ణ, శంకర్ పాల్గొన్నారు.

ఏళ్లుగా అంజన్న సన్నిధిలోనే మకాం

- వివాదాస్పదంగా మారుతున్న కొందరు భక్తుల తీరు
- మొక్కుల చెల్లింపునకు కొండగట్టుకు రాక


కొండగట్టు అంజన్న ఆలయం


భక్తులు ఉండే షెడ్‌లో సామానులు పెట్టుకున్న పాత భక్తులు

మల్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో కొందరు భక్తులు ఏళ్లుగా తిష్టవేశారు. ఆలయ ఆవరణలోనే మకాం వేశారు. అయినా వారిని పట్టించుకునే వారే లేక నిత్యం స్వామి వారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే అనేక మంది భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్నదానం, హారతి పూజల వద్ద మిగతా భక్తులకు వీరి వల్ల అసౌకర్యానికి గురవుతున్నారు. దేవస్థానంలో పని చేసే కొందరి సహకారంతో వివాదాలకు కారణమవుతున్నారు. కొండపై ఉం డే భక్తుల వివరాలపై దేవస్థానం అధికారులకు, సిబ్బందికి సరైన సమాచారం లేక ఏళ్లుగా తిష్టవేసిన భక్తులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో పలు మార్లు దేవస్థానం అధికారులు ఏళ్ల తరబడి కొండపైన మకాం వేసిన భక్తులను పంపించినప్పటికీ మళ్లీ వారం రోజుల్లోనే ఇక్కడకు చేరుకున్నారు. తాజాగా దశాబ్ద కాలంగా ఉంటున్న ఓ భక్తురాలు ఆలయ సిబ్బందిపై దూషించారని ఆ వ్యక్తి ఆత్మహత్యయత్నం చేసుకోవడం చర్చనీయంశంగా మారింది. అదే భక్తురాలు గతంలోనూ పలు ఆరోపణలు ఎదుర్కోనగా చర్యలు తీసుకోవల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం ఆలయ ఉద్యోగ, సిబ్బందే సహకరిస్తున్నారని ఆత్మహత్యయత్నానికి పాల్పడిన వ్యక్తి దేవస్థానం అధికారులకు ఫిర్యాదు కూడా చేశాడు. దీంతో ఇంకా అనేక మంది ఇక్కడ ఉన్న వారు ఇలాగే కొండపైన పెత్తనం చెలాయిస్తుండడంతో స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి.

మొక్కుల చెల్లింపు కోసం వచ్చి..

అంజన్నకు మొక్కుల చెల్లింపు కోసమని వచ్చిన అనేక మంది భక్తులు అంజన్న సన్నిధిలో ఉంటున్నారు. దేవస్థానానికి సంబంధించిన షెడ్లలో తమ సామానుతో మకాం ఏర్పరుచుకున్నారు. మతిస్థిమితం లేని వారు, సంతానం కోసం, అనారోగ్యం తదితర సమస్యలు ఎదుర్కొంటున్న భక్తులు కొండపైన 11, 21, 41 రోజులు ఉంటే తమకు మేలు జరుగుతుందని అంజన్న సన్నిధిలో ఉంటారు. అయితే ఆ భక్తుల రూపేన వచ్చిన వందలాది భక్తులు ఇక్కడే తిష్ట వేశారు. మరి కొందరు ఒంటరి వృద్ధులు, కుటుంబాలను కోల్పోయిన వారికి ఇక్కడ పునరావస కేంద్రంగా మారడంతో కొండపై భక్తులకు పడుకునేందుకు కనీసం స్థలం దొరకని పరిస్థితి ఏర్పడింది.

అన్నదానం.. హారతి పూజల్లో వారే..

నిత్యం కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో వంద మందికి శనివారం, మంగళవారం రోజుల్లో నూటయాభై మందికి నిత్యన్నదాన సత్రంలో భక్తులకతు అన్నదానం అందిస్తుంటారు. అయితే ఇందులో కనీసం 50మందికి పైగా ఇక్కడే మకాం వేసిన వారే ఉంటుండడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం దొరక్క ఆకలితో అలమటిస్తూ వెలుతున్నారు. ఇటీవల దేవస్థానం అధికారులు పాత భక్తులను నియంత్రణకు చర్యలు తీసుకున్నప్పటికి ఫలితం ఉండడం లేదు. దీంతో పాటు నిత్యం ఆలయంలో మహిళ భక్తులు నిర్వహించే హరతి పూజల్లోనూ వారే అధికంగా ఉంటున్నారు. కొందరు కొన్ని రోజుల పాటు తమ ఇళ్లకు వెళ్లిన వచ్చే వరకు వారి స్థానం పదిలంగా ఉంచుకునే ఏర్పాట్లు చేసుండడంతో నిత్యం వచ్చే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దేవస్థానం అధికా రులు ఏళ్ల తరబడిగా ఉంటున్న భక్తులను పంపించాలని పలువురు కోరుతున్నారు.

ఏళ్లుగా ఉన్న వారిని పంపిస్తాం

కొండపైన ఏళ్లుగా ఉన్న వారితో సమస్యలు ఎదురవ్వడం, నిత్యం వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగడం తమ దృష్టికి వచ్చింది. భక్తులను పంపించడం సున్నితమైన అంశం కాబట్టి ఇప్పటికే వారందరితో మాట్లాడడం జరి గింది. ఏళ్లుగా ఉన్నవారిని వెళ్లిపోవాలని సూచించాం. మేము కూడా పంపించడానికి తగు చర్యలు చేపడుతున్నాం.



- రామకృష్ణరావు, ఈవో

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు జగిత్యాల విద్యార్థులు


రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులతో కరాటే మాస్టర్లు

జగిత్యాల క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల జిల్లా కేంద్రంలోని పవన్ కరాటే అకాడమీలో శిక్షణ పొందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు కోచ్ అరుముల్ల పవన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికై మణిదీప్, అబ్దుల్ ముజిల్, శ్రీజ, రక్షిత, శివలను జగిత్యాల స్పోర్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు వల్లెపు మొగిలి ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు కార్తీక్, వికాస్ రావు, వెంకన్న, రాజ్ కుమార్ తదితరులు ఉన్నారు.

యూపీఎల్ అధికారులపై చీటింగ్ కేసు నమోదు

జ్యోతినగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ సంస్థలో కాంట్రాక్టు వ్యవహారాలు చేసిన యూటిలిటీ పవర్ టెక్(యూపీఎల్) సంస్థ అధికారులపై ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఎన్టీపీసీ ప్రాజెక్టులో కాంట్రాక్టరుగా పని చేస్తున్న చందా రాధా కిషన్‌రావుకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. సుమారు 48 లక్షల రూపాయల బిల్లులు ఇవ్వకుండా తనను వేధిస్తున్నారని రాధా కిషన్‌రావు ఫిరాదులో పేర్కొన్నారు. .ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ యూపీఎల్ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కాంట్రాక్టరు తెలిపారు. రాధాకిషన్‌రావు ఫిర్యాదు మేరకు యుపీఎల్ సీఈవో (నోయిడా) తేంద్ర సింగ్, ఆర్‌ఎం (రామగుండం ఎన్టీపీసీ) కైలాస్ ప్రసాద్, అధికారులు స్వాతి శుక్లా, సీమా ప్రసాద్‌లపై ఎన్టీపీసీ పీఎస్‌లో కేసు నమోదైంది. కాగా యూపీఎల్ సంస్థ కార్యకలాపాలు ఎన్టీపీసీలో చాలా రోజుల క్రితమే నిలిపివేశారు.

పురుగుల మందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య

గన్నేరువరం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒంటరితనంతో మనస్తాపం చెందిన ఓ వృ ద్ధురాలు ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, పోలీసు లు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చొక్కారావుపల్లికి చెందిన ముస్కు లచ్చవ్వ(80) అనే వృద్ధురాలికి నలుగురు కుమార్తెలు ఉన్నారు. అందరికి పెళ్లిళ్లు చేసింది. లచ్చవ్వ భర్త గతంలోనే మృతి చెందాడు. కూతుళ్ల వివాహం అనంతరం ఇంట్లో ఒక్కతే ఉంటున్నది. వృద్ధాప్యంలో ఉన్న తనను కూతుళ్లు చూసుకుంటారో లేదోననే బెంగతో ఆదివారం పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. లచ్చవ్వ కుమార్తె నాగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన బాణాసంచా పట్టివేత

హుజూరాబాద్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఓ ఇంట్లో నిల్వ చేసిన బాణాసంచాను ఆదివారం పట్టుకున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంట్లో ఎలాంటి అనుమతి లేకుండా బాణాసంచా నిల్వ చేశారని సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. రూ. 4.37 లక్షల విలువ గల క్రాకర్స్‌ను సీజ్ చేశారు. సీఐ తిరుమల్ గౌడ్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా టపాసులు నిల్వ చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేకాట స్థావరంపై దాడి

రామడుగు, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నర్సింగారావు చెరువు సమీపంలో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు ఆదివారం పోలీసులు దాడులు చేశారు. పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 7,070 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వి శేఖర్ తెలిపారు.

ఆదర్శం



రేకుర్తిలోని డాక్టర్ భాస్కర్ మాడేకర్ నేత్ర వైద్యశాల



కంటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్న వైద్యులు

పేదలకు పెద్దదిక్కు

రేకుర్తి నేత్ర వైద్యశాల

పేదల ఆసుపత్రిగా పేరుగాంచింది రేకుర్తి నేత్ర వైద్యశాల. అత్యాధునిక సదుపాయాలతో సేవాభావం కలిగిన వ్యక్తుల పర్యవేక్షణలో ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. దృష్టి లోపం ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆపరేషన్లు చేస్తున్నారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి శస్త్ర చికిత్సలు అవసరం ఉన్న వారిని గుర్తించి ఉచితంగా సొంత వాహనాల్లో ఆసుపత్రికి తరలిస్తారు. ఇప్పటి వరకు 1.8లక్షల మందికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించారు.

- డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఆలోచనతో అంకురార్పన
- పిడి చేతుల మీదుగా ప్రారంభం
- మూడు దశాబ్దాలకు పైగా సేవలు
- 1,80,000 మందికి కంటి ఆపరేషన్లు

భగత్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): సర్వేంద్రి యానాం.. నయనం ప్రధానం అన్నారు పెద్దలు. నేత్ర సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారిని ఆదుకుంటోంది రేకుర్తిలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ కరీంనగర్ డాక్టర్ భాస్కర్ మాడేకర్ ఉదార నేత్ర వైద్యశాల. ఈ ఆసుపత్రిని 1988వ సంవత్సరంలో ఆనాటి కేంద్ర మంత్రి పీవీ నర్సింహారావు ప్రారంభించారు. మూడెకరాల స్థలంలో ఆహ్లాదకర వాతావరణంలో ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. దేశంలోని నలుమూలల నుంచి వైద్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. 37 సంవత్సరాలుగా 7.95 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 1.8 లక్షల మందికి ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించారు. అందులో లక్ష కంటి శస్త్ర చికిత్సలు ఉచితంగా చేశారు. జిల్లాలోని 65 ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్న పిల్లలకు ఉచితంగా కంటి అద్దాలు అందించారు. నగరానికి చెందిన ఇంజనీర్ కోల అన్నారెడ్డి సహకారంతో 4,190 చనిపోయిన వారి నుంచి కళ్లు సేకరించి ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి పంపించారు. వారానికి నాలుగు గ్రామాల్లో నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా కంటి ఆపరేషనన్లు, కంటి అద్దాలు, ఉచిత భోజన వసతి కల్పిస్తారు.

అందుబాటులో ఆధునిక పరికరాలు

రేకుర్తి నేత్ర వైద్యశాలలో కార్పొరేట్ స్థాయిలో శస్త్రచికిత్సలు, పరీక్షల కోసం అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. ఆరు ఆపరేటింగ్ మైక్రోస్కోప్‌లు, ఐదు ఆటో రిఫ్రాక్టర్ మీటర్స్, ఐవోఎల్ మాస్టర్, ఏడీ యాగ్లేజర్, విజువల్స్ గ్లీన్లజర్, మూడు ఫాకో మిషన్లు, (సెంచురియన్, లారియేట్, లైజియాన్), ఆటో లెన్సోమీటర్, నాన్ కాంటాక్ట్ టొనమీటర్, హమ్‌ఫ్రేస్ ఫీల్డ్ అనలైజర్, ఎ స్కాన్ బయోమీటర్ ఆక్ట్-2, ఆటో క్లేవ్ ఉన్నాయి. ఆసుపత్రికి మూడు బస్సులు, ఒక మినీ వ్యాన్‌లు ఉన్నాయి. ఈ వాహనాల ద్వారా రోగులను ఆసుపత్రికి తీసుకొస్తుంటారు.



ఆసుపత్రిలోని అధునాతన పరీక్షా యంత్రం

ప్రత్యేక శస్త్ర చికిత్సలు

కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేసే శస్త్ర చికిత్సలు రేకుర్తి ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయి. అత్యాధునిక పరికాలతో కూడిన ఆపరేషన్ థియేటర్ ఇక్కడి ఉంది. ఆసుపత్రి అభివృద్ధి కోసం చైర్మన్ కొండావేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేష్, వైస్ చైర్మన్ ప్రకాశ్ హోల్లా, సెక్రటరీ బొమ్మ పవన్‌కుమార్, డాక్టర్ మురళీధర్‌రావు, కోల అన్నారెడ్డి కృషి చేస్తున్నారు.

నిష్ణాతులైన వైద్యులు

50 రూపాయల నామ మాత్రపు కన్సల్టేషన్ ఫీజుతో, అతి తక్కువ ఖర్చుతో కంటి శస్త్ర చికిత్సలు ఇక్కడ నిర్వహిస్తారు. నిష్ణాతులైన పది మంది వైద్యులు అందుబాటులో ఉంటారు.

మరిన్ని సేవలు అందిస్తాం..

- కొండా వేణుమూర్తి, ఆసుపత్రి చైర్మన్



రేకుర్తిలోని భాస్కర్ మాడేకర్ ఉదార నేత్ర వైద్యశాలలో భవిష్యత్తులో మరిన్ని సేవలను విస్తరించేందుకు కృషిచేస్తున్నాము. భవిష్యత్తులో లేజర్ (లాసిక్) పరికరాన్ని ఏర్పాటు చేస్తాం. పేదలకు సేవ చేయాలనేదే ఆసుపత్రి లక్ష్యం.



కంటి శస్త్ర చికిత్స కోసం వేచి ఉన్న రోగులు

ఆసుపత్రిలో 70 మంది సిబ్బంది ప్రజలకు సేవలు అందిస్తున్నారు.

ఆటో బోల్తా.. నలుగురికి తీవ్రగాయాలు



ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

మానకొండూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారులో ఆటో అదుపు తప్పి బోల్తా పడ్డ సంఘటనలో నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. శంకరపట్నం మండలంలోని తాడికల్ గ్రామానికి చెందిన గడ్డి కుమారస్వామి ఆదివారంతన ఆటోలో ప్రయాణికులను కేశవపట్నానికి తరలిస్తున్నాడు. మండలంలోని గట్టుదుద్దెనపల్లి కాకతీయ కాల్వ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కుమారస్వామి, చింతకుంట గ్రామానికి చెందిన ఎండీ ఖాజతో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం మేరకు 108 సిబ్బంది ఈఎంటీ సతీష్‌రెడ్డి, పైలెట్ ఖాజ ఖలీల్ ఉల్లా గాయపడ్డ నలుగురిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్య

ఇబ్రహీపట్నం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండలింగాపూర్ గ్రామానికి చెందిన గడ్డల జ్యోతి (55) అనే మహిళ గ్రామ శివారులోని పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.... జ్యోతి పదేళ్ల నుంచి షుగర్, బీపీతో పాటు మోకాళ్ల నొప్పులతో బాధపడుతోంది. పలు ఆసుపత్రులు తిరిగినా నయం కాకపోవడంతో మనస్తాపం చెంది ఈ నెల 26వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆదివారం ఉదయం పెద్ద చెరువులో జ్యోతి పడి ఉన్న విషయాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐ అనిల్ పరిశీలించి గ్రామస్థుల సహకారంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు జ్యోతి కుమారుడు గడ్డల విక్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఇల్లందకుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుర్తి గ్రామానికి చెందిన ననబోయిన కవిత (43) అనే మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్సై రాజ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కవిత ఈ నెల 21న పత్తి తీసే పని కోసం ట్రాక్టర్‌లో వెళ్లింది. ట్రాక్టర్‌ను డ్రైవర్ కుమారస్వామి అజాగ్రత్తగా నడపడం వల్ల దానిపై కూర్చున్న కవిత ప్రమాదవశాత్తు కిందపడింది. ఆమెకు తల, మెడ భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు జమ్మికుంటలోని ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందింది. కవితకు భర్త సమ్మయ్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త సమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ కుమారస్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజకుమార్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేశామన్నారు.

విద్యుదాఘాతంతో బోర్‌వెల్ మెకానిక్ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, ఇన్‌సెట్‌లో వైద్య వెంకటేశ్వర్లు(ఫైల్)

కోల్‌సిటీ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జీఎం కాలనీలో బోర్‌వెల్ మోటార్ మరమ్మతు చేస్తున్న బోర్‌వెల్ మెకానిక్, ఎలక్ట్రిషియన్ వైద్య వెంకటేశ్వర్లు(57) ఆదివారం విద్యుదాఘాతంతో మృతిచెందాడు. జీఎం కాలనీకి చెందిన చిన్నవెల్లి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి తన బోర్‌వెల్ మోటార్ పనిచేయడం లేదని బోర్‌వెల్ మెకానిక్ ఎలక్ట్రిషియన్ వెంకటేశ్వర్లును పిలిపించారు. యజమానిని విద్యుత్ సరఫరా నిలిపివేయమని వెంకటేశ్వర్లు చెప్పి స్టార్టర్ ముట్టుకోగా షాక్‌కు గురై మృతిచెందాడు. వెంకటేశ్వర్లు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. స్థానిక విఠల్‌నగర్‌లో నివాసముండే వెంకటేశ్వర్లు కుటుంబాన్ని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పరామర్శించారు. విద్యుత్‌శాఖ పరంగా రూ.5లక్షల పరిహారం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ఏడీఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. వెంకటేశ్వర్లు మృతిచెందడంపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు. కుమారుడు వైద్య నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

ఉపా చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సుభాష్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపా చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభను పౌరసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా సాయిబాబా కూతురు మంజీర మాట్లాడుతూ సాయిబాబాను ప్రభుత్వమే హత్య చేసిందని ఆరోపించారు. 90శాతం అంగవైకల్యం, పోలియో ఇతర 19 రకాల వ్యాధులతో బాధపడుతున్న ఆయనకు మందులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. సాయిబాబాను అరెస్టు చేసిన సమయంలో ఆయన వీల్ చైర్‌ను కావాలనే ధ్వంసం చేశారని అన్నారు. సమయానికి అత్యవసర మందులు, పుస్తకాలు, ఇతర సామగ్రిని కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. దళితులు, పీడిత ప్రజల పక్షాన, ఆదివాసీలపై ప్రభుత్వాల దమనకాం డకు వ్యతిరేకంగా మాట్లాడినందుకు ప్రభుత్వం ఆయనపై కక్ష కట్టిందని ఆరోపించారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఆదివాసీలను హననం చేసే ఆపరేషన్ గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఎన్నో సభలు నిర్వహించడంతోనే ప్రభుత్వం ఆయనపై అక్రమంగా ఉపా కేసు మోపి జైల్లో నిర్బంధించిందన్నారు. జైల్లో ఎందరో ఆదివాసీ యువకులను చేయని నేరానికి అక్రమంగా నిర్బంధించారని, వారి కోసం ఒక విద్యాసంస్థను నెలకొల్పే ఆలోచన సాయిబాబకు ఉండేదని ఆమె అన్నారు.

కార్యక్రమంలో విరసం నాయకుడు బాలసాని రాజయ్య, పౌర హక్కుల సంఘం బాధ్యులు శ్రీపతి రాజగోపాల్, నారా వినోద్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కె విశ్వనాథ్, రిటైర్డ్ ఎంఈవో వీరగోని పెంటయ్య, పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీపతి రాజగోపాల్, డీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మార్వాడి సుదర్శన్, రైతు సంఘం నాయకుడు ముడిమాడుగుల మల్లన్న, సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, మానవహక్కుల వేదిక బాధ్యులు కె అజయ్, రచయితలు అవునూరి సమ్మన్న, దేవేందర్, విద్యార్థి సంఘం నాయకులు చుక్క గంగారెడ్డి, దొగ్గలి రాజు, రచయిత కందుకూరి అంజయ్య, దళిత హక్కుల పోరాటాల సమితి తాళ్లపల్లి లక్ష్మణ్, ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లగౌడ్, సీపీఐ, సీపీఎం, డీటీఎఫ్, ఎంసీపీఐ, మానవ హక్కుల వేదిక, ఇతర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సాయిబాబా కూతురు మంజీర

బెటాలియన్‌లో పోలీసుల నిరసన

- సస్పెన్షన్ ఎత్తివేయాలని

కమాండెంట్ ఆఫీస్ ఎదుట ధర్నా



సిరిసిల్ల బెటాలియన్‌లో ధర్నా చేస్తున్న పోలీసులు

సిరిసిల్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 17వ బెటాలియన్‌లో పోలీసులు, హెడ్‌కానిస్టేబుళ్ల నిరసనలు కొనసాగాయి. ఏక్‌పోలీస్ అమలు చేయాలంటూ చేసిన ఆదోళనలో సస్పెన్షన్‌కు గురైన 39 మందిలో జిల్లా బెటాలియన్‌కు సంబంధించి బి తిరుపతి, బి శేఖర్ కె స్వామి, ఎ లక్ష్మణ్, శివరామకృష్ణ, కె నవీన్ ఉన్నారు. ఆదివారం వారితోపాటు బెటాలియన్ సముదాయంలో మిగతా పోలీసులు కమాండెంట్ ఆఫీస్ ఎదుట సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ధర్నా చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఏక్ పోలీస్ అమలు చేయాలని శాంతియుత నిరసన చేస్తే కొంత మందిని సస్పెండ్ చేశారన్నారు. సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, లేనిపక్షంలో నిరసనలో పాల్గొన్న తమను కూడా సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు.

పాత వాటికి కొత్త రూపం..

ఏదో సాధించాలనే ఆలోచన ఈ యువకుడిది.. నూతన ఆవిష్కరణలతో మూడుసార్లు వరల్డ్ రికార్డు సాధించాడు. రోబో, రిమోట్‌తో జాతీయ జెండాను ఎగురవేయడంతో పాటు ఎలక్ట్రిక్ బైక్ రూపొందించింది పలువురి ప్రశంసలందుకున్నాడు. పాత వస్తువులకు కొత్త రూపమిస్తూ అందరిని ఆకట్టుకుంటున్నాడు పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన బోసెట్టి భగత్ ప్రశాంత్...

- వినూత్న రీతిలో వస్తువుల తయారీ
- ఖని యువకుడి అద్భుత ఆవిష్కరణలు



పెట్రోల్ స్కూటీని ఎలక్ట్రికల్‌గా మార్చిన భగత్



వీల్‌రోలర్‌తో భగత్

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 27(ఆంధ్రజ్యోతి): నిత్యం ఏదైనా కొత్తగా సాధించాలనే తపన ఆ యువకుడిది. చదివిన చదువుతో తనకున్న జ్ఞానాన్ని జోడించి సరికొత్త ఆవిష్కరణలకు ప్రాణం పోస్తున్నాడు గోదావరిఖనికి చెందిన భగత్ ప్రశాంత్. స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన భగత్ డిప్లమా ఎలక్ట్రానిక్స్ డిగ్రీ బీకాం చదివాడు. పనికిరాని వస్తువులతో రోబోను, రిమోట్‌తో జాతీయ జెండాను ఎగురవేయడం, వీల్ రోలర్స్, పెట్రోల్‌తో నడిచే స్కూటీని ఎలక్ట్రిక్ స్కూటీగా తయారుచేయడంతో పాటు బైక్ పిస్టన్ ఎయిర్ డివైస్‌ను తయారు చేసి మూడు సార్లు వరల్డ్ రికార్డు సాధించాడు. పనికి రాని వస్తువులతో సరికొత్త వస్తువులను తయారుచేస్తున్నాడు. పెట్రోల్‌తో నడిచే స్కూటీని ఎలక్ట్రిక్ స్కూటీగా మార్చాడు. ఇది గంటకు 22 కిలోమీటర్ల స్పీడ్‌తో వెళుతుంది. భగత్ చెబుతున్నాడు. ఇలాంటి రెండు ఎలక్ట్రిక్ స్కూటీల్లో ఒకటి తన తండ్రికి బహుమతిగా ఇచ్చి, మరొకటి తాను వాడుకుంటున్నాడు. ఇందుకు గాను అప్పటి జిల్లా కలెక్టర్ సంగీతసత్యనారాయణ నుంచి ప్రశంసలు అందుకున్నాడు. అలాగే కొబ్బరి తురుమును తయారు చేసుకోవడానికి ఇళ్లలో మహిళలు ఇబ్బంది పడుతున్నారని గ్రహించిన భగత్ మార్కెట్‌లో ఎక్కువ ధర లభించే వాటికన్నా తక్కువ ధరలో మిషన్‌ను తయారు చేశాడు. ఇలా వినూత్న రీతిలో సరికొత్త ఆవిష్కరణలు చేస్తూ అందరితో భళా భగత్ అనిపించుకుంటున్నాడు.

ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని ఆవిష్కరణలు

- భగత్‌ప్రశాంత్

చిన్నప్పటికి వస్తువులను తయారు చేయాలనే తపన ఉండేది. అందుకే డిప్లమా ఎలక్ట్రానిక్స్ చదివాను. అప్పటి నుంచి పనికి రాని వస్తువుతో ఏదో ఒకటి తయారు చేస్తూ వస్తున్నాను. తయారు చేసిన రెండు ఎలక్ట్రిక్ స్కూటీల్లో ఒకటి నేను, మరొకటి నాన్న నడుపుతున్నాం. వీల్‌రోలర్స్ బైక్ పిస్టమ్ ఎయిర్ మిషన్ తయారు చేశాను. అందుకు మూడుసార్లు వరల్డ్ రికార్డులు అందుకున్నాను. చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని ఆవిష్కరణలను రూపొందిస్తాను. నాన్న భగత్ ప్రశాంత్ సైకిల్ రిపేర్ షాపు నడుపుతున్నాడు. కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో నేను ఆర్ఎఫ్‌సీఎల్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాను.

నేపాల్‌లో కరీంనగర్ వాసి మృతి

-ఆధ్యాత్మిక యాత్రలో విషాదం



కరీంనగర్ క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నేపాల్ యాత్రకు వెళ్లిన కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన పర్వతనేని నర్సింగారావు(60) అనారోగ్యానికి గురై ఆదివారం మృతి చెందాడు. మృతుడి బంధువులు, స్నేహితులు తెలిపిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా మరిమడ్ల గ్రామానికి చెందిన నర్సింగారావు చాలా కాలం కిందట కరీంనగర్‌కు వచ్చి ఇక్కడే ప్రగతినగర్‌లో స్థిరపడ్డాడు. అరుణాచలంలోని రుద్రాక్షస్వామి ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలకు చెందిన 250 మంది ఈనెల 18న నేపాల్ యాత్రకు వెళ్లగా, అందులో కరీంనగర్‌కు చెందిన నర్సింగారావు ఉన్నారు. నేపాల్‌లోని పశుపతి నాథ్, ముక్తినాథ్, జనక్‌పూర్ ప్రాంతాల సందర్శనలో భాగంగా మూడు రోజుల కిందట ముక్తినాథ్‌యాత్రలో నర్సింగారావు స్నానం చేసే సమయంలో ఒక్కసారిగా అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే తోటి యాత్రికులు అతన్ని జనక్‌పూర్‌లోని ఒక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. నర్సింగారావు అనారోగ్యంకు గురైన విషయాన్ని కరీంనగర్‌లోని ఆయన కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. అతని ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకువచ్చేందుకు ఎయిర్ అంబులెన్స్‌ను కూడా సిద్ధం చేస్తుండగా ఆదివారం ఉదయం మృతి చెందాడు. నర్సింగారావుకు భార్య, కూతురు, కొడుకులున్నారు. నర్సింగారావు కరీంనగర్‌లో ఒక ప్రైవేట్ చిట్‌ఫండ్స్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. నర్సింగారావు మృతదేహాన్ని కరీంనగర్‌కు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సింగారావు మృతి పట్ల ప్రగతినగర్ అభివృద్ధి, సంక్షేమ సంఘం ప్రతినిధులు, తోటపల్లి తాజా మాజీ సర్పంచ్ బోయినిపల్లి నర్సింగారావు, మానేరు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సంతాపం తెలిపారు.

గోదావరిలో మునిగి యువకుడి మృతి


వెంకటేష్(ఫైల్)

వల్లాపూర్, అక్టోబరు, 27 (ఆంధ్రజ్యోతి): వ ండలంలోని మొగిలిపేట గ్రామంలోని గోదావరి నదికి తన్నీర్ వెంకటేష్ (27) అను తాపీ మెస్త్రి స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు ఆదివారం నీట మునిగి మృతి చెందాడు.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలో తాపీ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తు న్న తన్నీర్ వెంకటేష్ ఆదివారం పనులకు సెలవు కావడంతో తోటి కూలీలతో కలిసి గోదావరి నదికి స్నానానికి వెళ్లాడు. స్నానం చేస్తున్న క్రమంలో ఈత రాకపోవడంతో వెంకటేష్ నీటిలో మునిగిపోయాడు. గమనించిన తోటి కూలీలు, స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో మునిగి వృద్ధుడు..

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని చెరువులో ప్రమాదవశాత్తు నీట మునిగి పోచెట్టి మాలద్రి(65) అనే భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా జలదంకి చెందిన పోచెట్టి మాలద్రి జగ్గసాగర్ గ్రామంలోని ఓ మేస్త్రి వద్ద ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం గ్రామంలోని చెరువులో ఒడ్డున ఉండి స్నానం చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి నీటిలో మునిగాడు. అక్కడే ఉన్న స్థానికులు గమనించి ఒడ్డుకు చేర్చినా అప్పటికే మృతి చెందాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సంఘటన స్థలానిన పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లైఫ్ స్టైల్

సెకండ్ హ్యాండైనా.. కొనేద్దాం..


కోరుట్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న సెకండ్ సేల్స్ కారు

పాతదో, కొత్తదో ఇంటికో కారు ప్రస్తుత రోజుల్లో సాధారణమైపోయింది. ఎవరి ఆర్థిక పరిస్థితిని బట్టి వారికి అందుబాటులో ఉన్న కారును కొనుక్కుని అవసరాలకు వినియోగించుకుంటున్నారు. కుటుంబంలో నలుగురు సభ్యులు ఉన్నారంటే చాలు కారు అవసరం ఉంటోంది. అందరూ కలిసి పండగలకు ఊరు వెళ్లాలన్నా, ఏ విహార యాత్రలకు వెళ్లాలన్నా స్వంత కారైనా లేదా అద్దె కారైనా తీసుకుని వెళ్తున్నారు. వినియోగదారుల ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా మార్కెట్లో సెకండ్ హ్యాండ్ కార్లు లభిస్తున్నాయి. అందుబాటు ధరల్లో ఉండడంతో పాటు ఫైనాన్స్ సౌకర్యం కూడా కల్పిస్తుండడంతో కొనేందుకు ముందుకు వస్తున్నారు. అయితే ఎప్పటికప్పుడు లేటెస్ట్ వర్షన్‌లతో కొత్త కార్లు మార్కెట్లోకి రావడంతో యజమానులు పాత వాటిని తీసేసి కొత్తవి కొంటున్నారు. దీంతో మార్కెట్లో మంచి కండిషన్ ఉన్న కార్లు అమ్మకానికి పెట్టేస్తున్నారు.

- మార్కెట్‌లో యూజ్డ్ కార్లకు డిమాండ్
- కొత్త వాటితో పోలిస్తే పాతిక శాతం ధరల్లోనే లభ్యం
- మక్కువ చూపుతున్న మధ్య తరగతి వర్గాలు

జగిత్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ కారులో తిరగాలనే కోరిక ఉండటం సహజమే. సొంత ఇల్లు అనే కోరిక నెరవేరిన తర్వాత ప్రతి మనిషికి ఉండే స్వప్నం కారు. ఇల్లు, ఇంటి ముందు కారు ఉండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. ఇప్పుడున్న ప్రస్తుత సమాజంలో కార్లను కొనేందుకు ఎంతో మంది ఆసక్తి చూపిస్తున్నారు. కొంతమంది మాత్రం మార్కెట్లోకి ఏ కొత్త రకం కారు వస్తే దానిని కొనేస్తుంటారు. అందుకు తగ్గట్టుగానే కస్టమర్స్‌ను ఆకర్షించేలా పలు రకాల కార్లు అందుబాటులోకి వస్తున్నాయి. మరి కొంతమందికి కారులో తిరగాలని కోరిక ఉన్నా, కారు కొనుగోలు చేసే స్తోమత లేక వెనకడుగు వేస్తుంటారు. మరికొంత మంది మాత్రం కొత్త కారుకు బదులు సెకండ్ హ్యాండ్ కార్లను కొనుగోలు చేస్తుంటారు. అందుకు అనుగుణంగా కస్టమర్లను ఆకట్టుకునేలా అన్ని రకాల సెకండ్ హ్యాండ్ కార్స్ కన్సల్టెన్సీలో అందుబాటులో ఉంటున్నాయి. జిల్లా కేంద్రమైన జగిత్యాలతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి తదితర పట్టణాల్లో సుమారు పాతిక వరకు సెకండ్ హ్యాండ్ కార్స్ సెల్స్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి.


జగిత్యాలలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న యూజ్‌డ్ కార్లు

● అప్ గ్రేడ్ వర్షన్‌లోకి మారుతుండడం వల్లే...

ఇక ఇప్పటికే కార్లున్నవారు అప్‌గ్రేడ్ వెర్షన్‌లోకి మారడం కూడా యూజ్డ్ కార్ల మార్కెట్‌లోకి పెద్ద ఎత్తున వాహనాలు వచ్చేలా చేస్తున్నది. ఇదిలా ఉంటే కుటుంబం మొత్తం తక్కువ ఖర్చుతో ప్రయాణించే వెసులుబాటు ఉం డటం, ప్రైవసీ, ఇతరత్రా సౌకర్యాల వల్ల కూడా ఇప్పుడు మధ్యతరగతి వర్గాలు యూజ్డ్ కార్లపైనే మక్కువ చూపిస్తున్నారు. మొత్తానికి లగ్జరీ కార్ల దగ్గర్నుంచి మిడిల్, స్మాల్ సెగ్మెంట్లలోని కార్లు ఈ ప్రీ-ఓన్డ్ వెహికల్స్ మార్కెట్‌లో లభిస్తున్నాయి.

● అందుబాటు ధరల్లో..

ప్రీ ఓన్డ్ వెహికల్ బిజినెస్ మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. నచ్చిన కార్లు సరసమైన ధరలకే లభిస్తుండడం, ఫైనాన్స్ సౌకర్యం కూడా ఉండటం, వారంటీలు ఇస్తుండడంతో పలువురు సెకండ్ హ్యాండ్ కార్లను కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు.కొత్త కార్ల ధరలతో పోల్చితే 15-25 శాతం ధరల్లోనే యూజ్డ్ కార్లు అందుబాటులో ఉంటుండటం ఇప్పుడు ఈ మార్కెట్‌ను పరుగు పెట్టిస్తున్నది. సెకండ్ హ్యాండ్ కారును కొనుగోలు చేయడం వల్ల కొత్త కారుతో పోలిస్తే డబ్బులు చాలా ఆదా అవుతాయి.మార్కెట్‌లోకి రకరకాల వేరియంట్లు, అబ్బురపరిచే ఫీచర్లతో వస్తుండడంతో చాలా మంది ఇప్పటికే ఉన్న పాత కార్లను అమ్మేస్తున్నారు. ఇందుకు సెకండ్ హ్యాండ్ కార్ సేల్ సెంటర్లు చక్కటి వేదికలుగా నిలుస్తున్నాయి. ఇక అటు అమ్మే వారికి, ఇటు కొనే వారికి లాభదాయకంగా లావేదేవీలు జరుగుతుండడం...ఈ బిజినెస్‌ను బడా మార్కెట్‌గానే మార్చేస్తోంది. ఏదైనా కంపెనీకి చెందిన ఓ మోడల్ కొత్త కారు ధర రూ. 10 లక్షలుగా ఉంటే...అదే మోడల్ పాత కారు ధర రూ. 2 లక్షలుగానే ఉండటం...కస్టమర్లను ఈ వైపు చూసేలా చేస్తున్నదని మార్కెట్ వర్గాలు ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నాయి. కండీషన్‌లో ఉండి, తక్కువ కిలో మీటర్లు తిరిగి, అప్‌గ్రేడ్ వెర్షనైతే మరో రూ. 50,000ల నుంచి రూ. లక్ష రూపాయలు ఎక్కువగా పెట్టుకోవాల్సి వస్తుందని చెప్తున్నారు. దీంతో అన్ని విధాలా సరిపోయే కారు రూ. 2.5 లక్షలు - రూ. 3 లక్షల్లో వచ్చేస్తున్నది.

నచ్చిన కార్లు...తక్కువ ధరల్లోనే..

- కట్కం ప్రసాద్, జగిత్యాల జిల్లా



నచ్చిన కార్లు సరసమైన ధరల్లోనే అందుబాటులో లభిస్తుండడంతో చాలా మంది సెకండ్ హ్యాండ్ కార్లు కొనుగోలు చేస్తున్నారు. మంచి కండిషన్‌లో ఉన్న కార్లను తక్కువ ధరలకు కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు. ప్రయాణానికి సైతం సౌకర్యవంతంగా ఉంటున్నాయి.

ఫైనాన్స్ సౌకర్యం సైతం ఉంటోంది

- దొనికెల నవీన్, యువకుడు, జగిత్యాల జిల్లా



సెకండ్ హ్యాండ్ కార్లు కొనుగోలు చేస్తున్న యజమానులకు ఫైనాన్స్ సౌకర్యం సైతం అందుతోంది. తక్కువ ధరలో మంచి మోడల్ కారు లభిస్తుండడంతో దీనికి తోడు తక్కువ వడ్డీతో ఫైనాన్స్ సౌకర్యం ఉంటుండడం వల్ల సెకండ్ సేల్స్ వైపు వినియోగదారులు ఆసక్తి కనబరుస్తున్నారు.

మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటు ధరల్లో..

- ప్రభురాజ్ లక్ష్మీ నర్సయ్య, ప్రయివేటు డ్రైవర్, జగిత్యాల జిల్లా



మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటు ధరల్లో సెకండ్ హ్యాండ్ కార్లు లభిస్తున్నాయి. ఇందు వల్ల చాలా కుటుంబాలు సెకండ్ హ్యాండ్ కార్లు కొనుగోలు చేసి తమ కలను నిజం చేసుకుంటున్నారు. మార్కెట్‌లో వస్తున్న కొత్త వర్షన్ కార్లపై క్రేజీ పడుతున్న కొందరు తమ వద్ద ఉన్న పాత కారును ఎంతో కొంతకు అమ్ముతున్నారు. వీటిని కొనుగోలు చేసి మధ్య తరగతి కుటుంబాల సభ్యులు వినియోగిస్తున్నారు.

న్యూస్ బాక్స్

కస్తూర్బా విద్యార్థినులకు అస్వస్థత

ముత్తారం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ ఆశ్రమ పాఠశాలలోని సుమారు 50 మంది విద్యార్థినులు ఆదివారం సాయంత్రం అస్వస్థతకు గురయ్యారు. ఆరు, ఏడు తరగతుల విద్యార్థినులకు ఒక్కసారిగా 50 మందికి పైగా దగ్గు రావడంతో పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులు గమనించి ప్రాథమిక చికిత్స అందించి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం వాతావరణ మార్పుల వల్ల విద్యార్థులు దగ్గరదగ్గరగా ఉండడంతో దగ్గు అందరికీ వ్యాపించిందని వైద్యుడు అమరేందర్ తెలిపారు. విద్యార్థులు ఆ సమయానికి భోజనం చేయలేదు కనుక ఫుడ్ పాయిజన్ కాలేదని నిర్ధారించారు. తొమ్మిది గంటల వరకు విద్యార్థినులకు దగ్గు తగ్గడంతో ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు నిర్ధారణ చేశారు. కాగా, విద్యార్థినులకు ఒక్కసారిగా దగ్గు రావడంతో స్థానికంగా ఉన్న తల్లిదండ్రులు ఆందోళన చెందారు. పాఠశాల వద్దకు వెళ్లడంతో వారిని ఆవరణలోకి అనుమతించకపోవడంతో కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు విద్యార్థినులు దగ్గుతో ఇబ్బంది పడుతున్నారన్న ఆందోళనతో తల్లిదండ్రులు వివరాలు అడిగేందుకు ప్రయత్నించారు. అయితే పాఠశాల లోపల ఉన్నవారు గేట్లకు తాళాలు వేసి నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబులెన్స్ తో పాటు ప్రైవేటు వాహనాల్లో తల్లిదండ్రులు, స్థానికుల సహకారంతో పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి విద్యార్థినులను సమయానికి తరలించడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

'రాజన్న' గోశాల పరిశీలన

వేములవాడ కల్చరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజన్న గోశాలను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. కోడెలకు సకాలంలో మేత వేయాలని ఉద్యోగులకు సూచించారు. కట్ట కింద గోశాలను, కొత్తగా వచ్చిన ఆరు కోడెలను పరిశీలించారు. సోమవారం సందర్భంగా భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున నందీశ్వర, లక్ష్మీగణపతి ధర్మశాలలను పరిశీలించారు. ఆయన వెంట ప్రోటోకాల్ మరియు గదుల విచారణ పర్యవేక్షకులు జి అశోక్ కుమార్, గోశాల ఇన్‌చార్జి వి పరమేష్ ఉన్నారు.

జాతీయ యోగాలో తెలంగాణకు పసిడి పతకం

- రికార్డు సృష్టించిన దీపక్



బంగారు పతకంతో దీపక్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి యోగా పోటీల్లో తెలంగాణకు తొలి సారిగా స్వర్ణ పతకం లభించింది. జిల్లాలోని మానకొండూర్ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న పి దీపక్ సబ్‌జూనియర్ విభాగంలో పసిడి పతకం సాధించి రికార్డు సృష్టించాడు. హిమాచల్‌ప్రదేశ్‌లోని ఉనాలో ఈనెల 24 నుంచి 27 వరకు జరిగిన జాతీయ పోటీల్లో దీపక్ గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా దీపక్‌ను, కోచ్ రామకృష్ణను తెలంగాణ యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, జిల్లా యోగా అసోసియేషన్ బాధ్యులు అభినందించారు.


జూడో పోటీల్లో సత్తా చాటాలి

- రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు కడారి అనంతరెడ్డి


పోటీలను ప్రారంభిస్తున్న కడారి అనంతరెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు సత్తాచాటి చాంపియన్‌గా నిలవాలని రాష్ట్ర జూడో సంఘం ఉపాధ్యక్షుడు కడారి అనంతరెడ్డి అన్నారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్ మంకమ్మతోటలోని సాయి మానేరు పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల జూడో ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులలో ఆత్మస్థైర్యానికి, ఆత్మ విశ్వాసానికి జూడో క్రీడ ఎంతగానో దోహద పడుతుందన్నారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా స్థాయి జూడో ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 150 మందికిపైగా బాలబాలికలు హాజరైనట్లు పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో రాణించిన క్రీడాకారులను వరంగల్ జిల్లాలో జరిగే 68వ రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సరితరెడ్డి, పీడీలు, పీఈటీలు రమణ, విద్యాసాగర్, శ్రీధర్, శ్రీనివాస్, సుధాకర్, నరేందర్, కోచ్ సాయిరాం యాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


రుచిత్‌రెడ్డి

ఇల్లంతకుంట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపెల్లి గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అంకిళ్ళ రుచిత్‌రెడ్డి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న రుచిత్‌రెడ్డి పాఠశాల స్థాయి క్రీడలలో అండర్ 17విభాగంలో ఇటీవల గోదావరిఖనిలో జరిగిన పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై హెచ్‌ఎం పావని, వ్యాయామ ఉపాధ్యాయుడు సాన బాబు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బట్టు పద్మ తదితరులు అభినందించారు.

రాష్ట్రంలో యువజన కమిషన్ ఏర్పాటు చేయాలి

- యువతకు ఉపాధి కల్పనలో మోదీ సర్కారు విఫలం
- సీపీఐ జాతీయ నేత చాడ వెంకట్‌రెడ్డి

జ్యోతినగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యువజన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌నకు చాడా వెంకట్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. స్వాతంత్రం వచ్చి 76ఏళ్లు దాటుతున్నప్పటికీ దేశంలో ఆర్థిక అసమానతలు అలాగే ఉన్నాయన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వల్ల దక్కిన ప్రాథమిక హక్కులను సైతం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం హరిస్తోందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత మత రాజకీయాలకు ప్రాధాన్యతనిస్తున్నాడని విమర్శించారు. దేశంలో యువకు ఉపాధి మార్గాలు చూపించకుండా అభివృద్ధి సాధ్యం కాదన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ఇచ్చిన హామీని మోదీ మర్చిపోయాడన్నారు. 10 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. దేశంలోని సహజ వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. ఆల్ ఇండియా యూత్ పెడరేషన్(ఏఐవైఎఫ్) జాతీయ క్యాదర్శి తిరుమలై రామన్ ప్రసంగిస్తూ సిద్ధాంతపరమైన రాజకీయ, శాస్త్రీయ ఆచరణకు వర్క్‌షాప్‌లు దోహదపడుతాయన్నారు. విద్య, ఉపాధి, వైద్యం కోసం నేటి యువత పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మానస్ కుమార్, మార్కురురి సూర్య, నాయకులు రవి, శంకర్, యుగంధర్, శ్రీనివాసులు, రామకృష్ణ, మహేందర్, కొండల్, మహేశ్, చిలుక రాజు, శ్రీను, సదానందం, గౌతం, మోహన్, కనకరాజు, ప్రజానాట్యమండలి కళాకారులుడు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

వరద కాలువలో వైద్యుడి గల్లంతు


ప్రమాద వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ, సీఐ, ఇన్‌సెట్‌లో పాకనాటి ఉదయ్‌కిరణ్‌రెడ్డి(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి రూరల్ మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రా మంలోని విట్టంపేట శివారులో ఉన్న ఎస్సారెస్పీ వరద కాలువలో ఈత కొడుతూ పాకనాటి ఉదయ్‌కిరణ్‌రెడ్డి(29) అనే వైద్యుడు ఆదివారం గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి, రాయికల్ మండల కేంద్రాల్లో వైద్యులుగా పనిచేస్తున్న పాకనాటి ఉదయ్‌కిరణ్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్ స్నేహితులు. ఆదివారం వారంతా సరదాగా గడపడానికి మరో ఇద్దరు వైద్యులు ఆత్మకూరి రాజు, లింగాల నిఖిల్‌తో కలిసి మండలంలోని మెట్లచిట్టాపూర్ గ్రామానికి వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో విట్టంపేట శివారులో ఉన్న ఎస్సారెస్పీ వరద కాలువలో ఈత కొట్టేందుకు ఆగారు. కాలువలో స్నానం చేయడానికి వారంతా దిగారు. ఈత కొడుతుండగా ఉదయ్‌కిరణ్‌రెడ్డి నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు వెంటనే ఒడ్డుకు చేరుకుని అక్కడే ఉన్న జాలర్లకు విషయం తెలిపారు. జాలర్లు ఎంత ప్రయత్నించినా ఉదయ్‌కిరణ్‌రెడ్డి ఆచూకీ తెలియలేదు. పోలీసులు అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఎస్సారెస్పీ అధికారులకు సమాచారం అందించి నీటి ప్రవాహం తగ్గించేందుకు వరదకాలువ గేట్లు మూసివేయించారు. అప్పటికే చీకటి పడిపోవడంతో గాలింపు చర్యలకు ఆటంకంగా మారింది. ఉదయ్‌కుమార్‌రెడ్డి హనుమకొండ జిల్లా వేలేరు గ్రామానికి చెందిన వాడు. ఆయన గల్లంతైన విషయాన్ని కుటుంబ సభ్యులకు, పోలీసులు సమాచారం అందించారు.

దిగువ మానేరులో అరుదైన పక్షులు

- కరీంనగర్‌కు వలస వచ్చిన ఇండియన్ స్కిమ్మర్స్
- ఈ ప్రాంత జీవ వైవిధ్యానికి కొత్త అందం..


మానేరు డ్యాంలో ఇండియన్ స్కిమ్మర్స్ పక్షులు



పక్షులను కెమెరాలో బంధిస్తున్న బర్డ్ వాచర్స్

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ స్కిమ్మర్స్.. ఈ పక్షులు అరుదైనవి.. ఇవి మధ్యప్రదేశ్, రాజస్థాన్ సరిహద్దుల్లో ప్రవహించే చంబల్ నది, ఒడిస్సాలోని మహానది ఇసుక మేటల్లో నివసిస్తూ ఉంటాయి. శీతాకాలంలో ఆహారం కోసం సముద్ర తీర ప్రాంతాలకు వలస వెళుతుంటాయి. అటువంటి ఇండియన్ స్కిమ్మర్స్ కరీంనగర్ సమీపంలోని లోయర్ మానేరు డ్యాంలో కనిపించాయి. ఈ పక్షులు గత ఏడాది లోయర్ మానేరు డ్యాంకు వలస వచ్చినట్లుగా ఐయూసీఎన్ (ఇంటర్‌నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్) వారు గుర్తించారు. అరుదైన పక్షులు ఈ ప్రాంతానికి వలస రావడంతో పక్షి ప్రేమికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు వీటి రాకతో ఈ ప్రాంత జీవవైవిధ్యానికి కొత్త అందం చేకూరినట్లైంది. ఈ నెలలో ఇండియన్ స్కిమ్మర్స్ లోయర్ మానేరు డ్యామ్‌లో రెండోసారి కనబడినట్లు ఈ-బర్డ్‌లో రికార్డయ్యింది. ఈ అరుదైన పక్షుల గురించి తెలుసుకోవడానికి కరీంనగర్ బర్డింగ్ కమ్యూనిటీ(కేబీసీ) ప్రతినిధులు ప్రయత్నించారు. ఈ పక్షుల సంఖ్యను లెక్కించడంతోపాటు, వాటి రూస్టింగ్ (విశ్రాంతి)ప్రదేశాలను కనుగొన్నారు. ఈ సమాచారాన్ని కరీంనగర్ అటవీశాఖ అధికారులకు అందించడానికి కరీంనగర్ బర్డింగ్ కమ్యూనిటీ(కేబీసీ) ప్రతినిధులు ఒక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అంతరించిపోతున్న ఇండియన్ స్కిమ్మర్స్ పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని చర్చించారు.

● ఇండియన్ స్కిమ్మర్స్ ప్రత్యేకతలు....

ఇండియన్ స్కిమ్మర్స్ నలుపు రంగులోను, తెలుపు రంగులో ఉంటాయి. ముక్కు ముదురు నారింజ రంగులో, ముక్కు చివరి భాగం పసుపు రంగులో ఉంటుంది. ముక్కుపై భాగం చిన్నగా, కింద భాగం పెద్దగా ఉంటుంది. ఇవి రివర్ టెర్న్ పక్షులను తలపించేలా ఉన్నప్పటికీ, ఆహారాన్ని సేకరించే విధానాన్ని బట్టి వీటిని ప్రత్యేకమైన పక్షులుగా గుర్తించవచ్చు. ఇవి నది ఉపరితలంపై ఎగురుతూ ముక్కుతో నీటిలోని చేపలను అందుకొని గాలిలోనే ఎగురుతూ చేపలను తింటాయి. ఈ కారణంగా వీటిని స్కిమ్మర్స్ అని పిలుస్తారు. ఇవి దక్షిణాసియా భూభాగానికి మాత్రమే పరిమితం. వీటి సంఖ్య అంత్యత వేగంగా తగ్గుతున్నది. గత మూడేళ్లలో 30 శాతానికి పైగా పడిపోయింది. ప్రస్తుతం ఇండియాలో ఈ పక్షులు సుమారు 2,700 ఉండొచ్చని ఒక అంచనా. ఇవి సాధారణంగా జనాల అలికిడి లేని నది, సముద్రం మధ్యలోని ఇసుక మేటల్లో, ద్వీపాల్లో నివాసం ఏర్పాటు చేసుకుంటాయి. దిగువ మానేరు జలాశయం మధ్యలో పెద్ద బండరాళ్లు, చిన్న చిన్న ద్వీపాలు ఉండటంతో ఇండియన్ స్కిమ్మర్స్ వాటిలో ఆవాసం ఏర్పాటు చేసుకుని మానేరు జలాశయం నీటిలో చేపలు, కీటకాలను ఆహారంగా తీసుకుంటూ జీవిస్తున్నాయి. అరుదైన ఇండియన్ స్కిమ్మర్ పక్షుల సమాచారాన్ని కరీంనగర్ బర్డింగ్ కమ్యూనిటీ(కేబీసీ) వ్యవస్థాపకులు మూటపల్లి గంగాధర్, మధు గోసిక, అబ్దుల్ రహీం, వివేక్ మాత కరీంనగర్ అటవీశాఖ అధికారులకు అందించారు.

బాలుడి వైద్యానికి ఆర్థికసహాయం

మల్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండల కేంద్రానికి చెందిన షేక్ సద్దాం హుస్సేన్ కుమారుడు గుండె వాపు వ్యాధితో బాధపడుచుండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం మన నేస్తం హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సహాయం అందించారు. ఈ మేరకు రూ.10వేలను బాలుడి కుటుంబసభ్యులకు అందించగా ఈ కార్యక్రమంలో బొజ్జ నర్సయ్య, లవన్, గుర్రం శ్రీధర్‌గౌడ్, పొనగంటి అశోక్, విష్ణు, వేణు, అంజద్ ఖాన్, సాజిద్, కరీం, రహుల్, విష్ణు, శివ పాల్గొన్నారు

ఉచిత దంత వైద్యశిబిరం

బీర్‌పూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుంగూర్ గ్రామంలో ఆదివారం భారత్ డెంట్ ఆధ్వర్యంలో ఉచిత డెంటల్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారత్ డెంటల్ వైద్యులు, సిబ్బంది గ్రామంలోని ప్రజలకు ఉదయం 7గంటల నుండి 10 గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడిసె జితేందర్ యాదవ్, రమేష్ పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

మల్లాపూర్, అక్టోబరు, 27 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందడానికి పట్టభద్రులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని బీజేపీ మండలాధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల ఇన్‌చార్జి వడ్డేపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పట్టభద్రులకు ఓటు నమోదు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థికి మద్దతు తెలపాలని కోరారు. 2021 నవబంర్‌లోపు డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరు పట్టభద్రుల ఓటు నమోదు నమోదు చేసుకోవాలని, ఓటు హక్కు వేయడం బాధ్యతగా భావించాలన్నారు. బీజేపీ నాయకులు ఎర్ర లక్ష్మీ, లవంగ శివ, గడ్డం నర్సారెడ్డి, ము స్కెరి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నత్తనడకన ఆలయ అభివృద్ధి పనులు

● వివిధ పనులకు నిధుల మంజూరు

● 35.17 కోట్ల పనులు రద్దు చేసిన ప్రభుత్వం

ధర్మపురి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి ఆలయ అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. అభివృద్ధి పనుల కోసం గత ప్రభుత్వం ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి 100 కోట్లు పనులు చేపట్టడం కోసం నిర్ణయించింది. నాలుగు ఏళ్ల క్రితం మొత్తం 22 పనుల కోసం 62.69 కోట్ల పనులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం 7.52 కోట్ల నిధులతో పనులు చేపట్టగా కంట్రాక్టర్‌కు బిల్లులు సరిగా రాకపోవడం వల్ల పనులు నత్తనడకగా కొనసాగుతున్నాయి. నిర్మాణ దశలో ఉన్న ధర్మపురి బస్‌స్టేషన్ వద్ద శ్రీ లక్ష్మీ నరసింహ సదన్ 30 గదుల నిర్మాణ పనులు నత్తనడకగా కొనసాగుతున్నాయి. నాగమయ్య ఆలయ పునః నిర్మాణ పనులు కూడ ఆలస్యం అవుతున్నాయి. మార్కెట్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, గంగామాత దేవాలయం నిర్మాణం, రాయపట్నం వద్ద ఆర్చిగేట్ నిర్మాణ పనులు చేపట్టడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

● భూసేకర కోసం 20 కోట్లు

ధర్మపురి దేవాలయాన్ని అభివృద్ధి పరచేందుకు భూసేకర కోసం ప్రభుత్వం 20 కోట్లు మంజూరు చేసింది. ఇందులో ఆలయం చుట్టూ ఉన్న ఆరుగురు ఇంటి యజమానులు కోర్టును ఆశ్రయించారు. తమకు ఉండటానికి ఇళ్లు లేవని చెప్పి కొందరు, మరి కొందరు నష్టపరిహారం అధికంగా ఇవ్వాలని అధికారులను ఒత్తిడి చేశారు. ఆలయ అధికారుల ప్రత్యేక చొరవతో 5 గురు వ్యక్తులు కోర్టు నుంచి కేసులు ఉపసంహరించుకున్నారు. మరొక వ్యక్తి కోర్టులో కేసు వేయడం వల్ల భూసేకరణలో కూడ తీవ్ర జాప్యం జరుగుతుంది.



అసంపూర్తిగా పుట్ట బంగారం గుడి నిర్మాణ పనులు

● కొన్ని పనులు రద్దు..

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్మాణం కాని 16 పనులను ప్రభుత్వం రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో రాయపట్నం వద్ద గరుడ విగ్రహం, తుమ్మెనాల స్టేజీ వద్ద ఆర్చిగేట్, మార్కెట్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను ప్రభుత్వం రద్దు చేసింది. శ్రీ ఉగ్రనారసింహ స్వామి ఆలయ పునః నిర్మాణం, కోనేరు రినోవేషన్, శివాలయానికి 3 స్టోర్ రాజగోపురం, రథాల కర్రతో తయారు, రథశాల నిర్మాణ పనులు కూడ రద్దు చేయడం జరిగింది. శ్రీ అక్కపెల్లి రాజ రాజేశ్వర స్వామి దేవాలయం, సత్యవతి దేవాలయం అభివృద్ధి, చింతామణి చెరువులో వరహమూర్తి విగ్రహ నిర్మాణం, ప్రధాన దేవాలయం నిర్మాణం రద్దు అయ్యింది. యమధర్మ రాజు ఆలయ రినోవేషన్, నంది చౌక్ వద్ద ఆర్చి నిర్మాణం, మంగళిగడ్డ వద్ద సుందరీకరణ పనులు రద్దు చేయడం జరిగింది. ఈ పనుల కోసం టెండర్లు వేయగా కంట్రాక్టర్‌లు ఎవరు కూడ ముందుకు రాలే దు.

పనులు కొనసాగుతున్నాయి

ఈవో సంకటాల శ్రీనివాస్



ధర్మపురి క్షేత్రంలో 7.52 కోట్ల నిధులతో పనులు కొనసాగుతున్నాయి. భూసేకరణ కోసం 20 కోట్లు మంజూరు అయ్యాయి. ఒక వ్యక్తి కోర్టులో కేసు వేశారు. త్వరలో ఆ వ్యక్తి కూడ కేసును ఉపసంహరించుకుంటారు.

ప్రభుత్వం 16 పనులను రద్దు చేసింది. త్వరలో ప్రభుత్వ విప్, ధర్మ పురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక చొరవతో రద్దు చేసిన పనులకు తిరిగి ప్రతిపాదనలు పంపిస్తాము.

పశు గణన షురూ..

3వ పేజీ తరువాయి..

వాస్తవానికి ఈ ఏడాది సెప్టెంబర్‌లోనే పశువుల గణన చేపట్టాల్సి ఉంది. కానీ యాప్ తదితర అంశాల్లో చేసిన మార్పులతో ఈనెల 25వ తేదీ నుంచి పశుగణన చేపట్టారు. జిల్లా పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఈ గణన కొనసాగనుంది. పశు వైద్య శాలల డాక్టర్లు సూపర్‌వైజ ర్లుగా, గోపాల మిత్రులు పారా స్టాఫ్ ఎన్యుమరేట ర్లుగా ఈ పశుగణన కార్యక్రమం ప్రారంభిం చారు. డాక్టర్లు గణనను పర్యవేక్షించ నున్నారు. ప్రతి ఇంటికి ఎన్యుమరేటర్ వెళ్లి పలు అంశాలపై ఆరా తీసి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. తెల్లజాతి పశువులు, నల్లజాతి పశువుల తోపాటు గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు, కోళ్లు, ఇళ్లు పెంపుడు పశువులన్నింటి వివరాలు నమోదు చేస్తున్నారు. ఆ రైతు పేరు, ఇంటి నంబర్, ఫోన్ నంబర్, పశువుల వివరాలతో పాటు వాటి వయస్సు ఇతరత్రా వివరాలను డిజిటలైజేషన్ ద్వారా పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల సమీకృత కలెక్టరేట్ కార్యా లయంలో అఖిల భారత జాతీయ పశుగణన కార్యక్ర మం వాల్ పోస్టర్లను కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ గౌతం రెడ్డి, జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ ఎస్ఎల్ మనోమర్, జిల్లా ఉప పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ బోనగిరి నరేశ్ ఆవిష్కరించారు. పశు గణనను విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రతి ఇంటికి వెళ్లాలని, గణన ప్రాధాన్యత ను గమనించాలని ఆదేశిం చారు. వాల్ పోస్టర్లను పశువైద్యశాలల ఎదుట, సంబంధిత కార్యాలయాల ఎదుట ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలోని పశువైద్య శాలల్లో పలు పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఒక వైపు పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ మరో వైపు పకడ్బందీగా పశు గణనను నిర్వహించడానికి పశు సంవర్థక శాఖ అవసరమైన చర్యలు తీసుకుంటోంది.

పకడ్బందీగా పశు గణన



జిల్లాలో పశుగణన పకడ్బందీగా నిర్వహించ డానికి చర్యలు తీసుకుంటున్నాము. ఈ గణనతో పశువుల లెక్క పక్కాగా తేలనుంది. దీనిని ఆధా రంగా చేసుకుని సంబంధిత వ్యాక్సీన్లు, ప్రభుత్వ సబ్సిడీ దానా తదితర వాటిపై ప్రభుత్వాలు సుల భంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. నాలుగు నెలల పాటు గణన జరుగుతుంది. సర్వేకు అన్ని గ్రామాల రైతులు సహకరించాలి.

\- సత్య ప్రసాద్, జిల్లా కలెక్టర్

కార్మికుల సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు

3వ పేజీ తరువాయి..

ఆంధ్రజ్యోతి : సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు ఏ మేరకు ప్రయోజనాలు అందిస్తున్నారు..?

అధికారి : తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా నమోదైన కార్మికులకు పలు ప్రయోజనాలు అందిస్తున్నాము. వివాహ కానుక ద్వారా రూ. 30 వేలు, ప్రసూతి సాయం కింద రూ. 30 వేలు, సాధారణ మరణం పొందిన కుటుంబానికి రూ. 60 వేలు, ప్రమాదం వల్ల చనిపోతే రూ. 6 లక్షలు, కార్మికుని దహన సంస్కారానికి రూ. 30 వేలు, ప్రమాదం వల్ల అంగవైకల్యం పొందితే రూ. 5 లక్షలు, తాత్కలిక వైద్య ఖర్చులకు నెలకు రూ. 4,500 చొప్పున గరిష్టంగా రూ. 13,500లు మూడు నెలల వరకు మాత్రమే అందిస్తున్నాము.

ఆంధ్రజ్యోతి : కార్మిక శాఖలో అవినీతి అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

అధికారి : కార్మిక శాఖలో ఎక్కడా కూడా అవినీతి జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాము. కార్మికునిగా నమోదు మొదలుకొని ప్రయోజనాలు పొందే వరకు అడుగడుగునా ఎక్కడయిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అక్రమాలు, అవినీతికి పాల్పడుతున్నట్లయితే వెంటనే సమాచారం అందించాలని అవగాహణ కల్పిస్తున్నాము. జిల్లా కార్మిక శాఖ కార్యాలయంలో గానీ, కలెక్టరేట్‌లో గానీ, అవినీతి నిరోదక శాఖ అధికారులకు గానీ సమాచారం ఇచ్చినట్లయితే తగు చర్యలు తీసుకుంటామని వివరిస్తున్నాము. దళారులను ఆశ్రయించి కార్మికులు మోసాలకు గురికావద్దని ప్రచారం చేస్తున్నాము.

శతాధిక వృద్ధుడికి ఘనంగా జన్మదినం



పెగడపల్లిలో శంకర్‌రావు జన్మదినంలో పాల్గొన్న కుటుంబసభ్యులు

పెగడపల్లి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల కేంద్రంలో ఆదివారం బోయినపల్లి శంకర్‌రావు అనే శతాధిక వృద్ధుడి జన్మదినాన్ని కుటుంబసభ్యులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన బోయినిపల్లి శంకర్‌రావు వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆయన కుమారులు, కూతుళ్లు, బంధువులు కలసి మండల కేంద్రంలో 100వ జన్మదినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శంకర్‌రావుతో కేక్ కట్ చేయించారు.

పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడిగా భాస్కర్

రాయికల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి సేవా సంఘం హైస్కూల్ వాడ నూతన అధ్యక్షుడిగా కట్టెకోల భాస్కర్ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో కోశాధికారిగా దాసరి శ్రీనివాస్, ఉపాధ్యక్షునిగా మామిడాల నాగభూషణం, కార్యదర్శిగా అనుమల్ల వెంకటరమణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని వాడకట్టు సభ్యులు రాము, రాజేశం, శంకర్, భూమేష్, విశ్వనాథం, అభినందించారు.



మాట్లాడుతున్న జిల్లా అధికారి మనోజ్ కుమార్

కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలి

సహకార సంఘ జిల్లా అధికారి మనోజ్ కుమార్

కోరుట్ల రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వాహకులు సక్రమంగా నిర్వహించాలని సహకార సంఘ జిల్లా అధికారి మనోజ్ కుమార్ అధికారులకు సూచించారు. ఆదివారం పట్టణంలోని సహకార సంఘ భవనంలో కోరుట్ల, కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాలోని సహకార సంఘ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల వారిగా ఉన్న వరి సాగు వివరాలను అడిగి తెలుసుకోని కొనుగోలు తీసుకునే జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా అధికారి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ధాన్యం కొనుగోళ్ల లో లోపాలు లేకుండా చూడాలన్నారు. కేంద్రాలకు వచ్చే రైతులకు అందుబాటులో ఉండి సిబ్బంది సేవలు అందించాలని సూచించారు. కేంద్రాలలో మౌలిక వసతులను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ మల్లేశం, వేణుమాదవ్‌లతో పాటు వివిధ సహకార సంఘ కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్నింటికన్నా విద్యా దానం గొప్పది

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యా దానం చాల గొప్ప దని, మనం చదివే విద్య అనేది వృథాగా పోదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పట్టభద్రులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ఆల్ ఫోర్స్ వీఎస్‌ఆర్‌ఈ క్లాసెస్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆల్‌ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌తో కలిసి ఆయన ప్రత్యేకంగా తయారు చేసిన యాప్‌ను ప్రారంభించారు. అనంతం లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఉచిత కోచింగ్ క్లాసులు వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తామని చెప్పడాన్ని అభినందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్‌ఫోర్స్ విద్యా సంస్థల యజమాని నరేందర్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, వెలగటూర్, బుగ్గారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేసుల పరిష్కారంలో అలసత్వం చేయొద్దు

మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు



స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

మల్లాపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : పోలీసు స్టేషన్‌లోని కేసుల పరిష్కారంలో అలసత్వం చేయకుండా వెంటనే పరిష్కరించే దిశగా విచారణ చేపట్టాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు అధికారులకు సూచించారు. పోలీసు వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం మల్లాపూర్ పోలీసు స్టేషన్‌ను మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, లాకప్ సేల్, పట్టుకున్న వాహనాలు, పరిసరాలు పరిశీలించి కేసుల విచారణ, పరిష్కారంలో అవలంభిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్‌కు పిర్యాదు చేసేందుకు వచ్చే వారికి భరోసా కల్పిస్తూ న్యాయం చేయాలన్నారు. కేసుల దర్యాప్తు న్యాయ బద్ధంగా చేసిన నిదింతులకు త్వరగా శిక్షలు పడేలా విచారణ చేపట్టాలని పలు సూచనలు చేశారు. అనంతరం పోలీసు స్టేషన్ ఆవరణలో మొక్క నాటి నీరు పట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కిరణ్‌కుమార్, అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి నిధులు కేటాయించండి

ఎమ్మెల్యేకు మహిళ సంఘాల వినతి

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి) మహిళ సంఘ భవనాన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు జగిత్యాల అర్బన్ సెర్ప్, ఐకేపీల మహిళ సమాఖ్య సభ్యులు ఆదివారం వినతి పత్రం సమర్పించారు. అర్బన్ మహిళ సమాఖ్యకు స్వంత భవనం లేనందున సమావేశాల నిర్వహణ కష్టతరంగా మారిందని ఈ సందర్భంగా మహిళలు ఎమ్మెల్యేకు విన్నవించగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని మహిళలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మహిపాల్ రెడ్డి అక్షర మహిళ సమాఖ్య సభ్యులు దేశవేని గంగా భవాని, కళావతి, అంబటి జమున, సుమలత, దుంపెట విజయ, లక్ష్మీ, లత, ఎల్లవ్వ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం

బీర్‌పూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలో ఇటీవల నూతనంగా ఎన్నికైనా ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఆదివారం కొల్వాయి గ్రామంలోని శ్రీ సీతా రామ చంద్ర ఆలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రి మండల కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారన్ని చేయించారు. బీర్‌పూర్ గ్రామానికి చెందిన అక్కినపల్లి వేణుగోపాల్‌ను జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు నియామక పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఆలయ చైర్మన్ జక్కుల రవీందర్, ధర్మపురి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుల కూరగాయల సంతోష్, మాజీ అధ్యక్షులు పాత రమేష్, సారంగాపూర్ మండల అధ్యక్షులు రాజన్న, బీర్‌పూర్ నూతన అధ్యక్షులు రేగొండ రమేష్, ఉపాధ్యక్షులు అనంతుల సత్తయ్య, గౌరవ అధ్యక్షులు ఆకినపల్లి రాజయ్య, ప్రధానకార్యదర్శి రాము, కోశాధికారి రమేష్ పాల్గొన్నారు.

చెరువుల నిర్వహణ ప్రశ్నార్థకం..!

● యాసంగి సీజన్ ప్రారంభం

● నీరటి కార్మికులు లేకపోవడంతో పారకంపై రైతుల ఆందోళన

● కాలువల మరమ్మతులను పట్టించుకోని వైనం

కథలాపూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఈ ఖరీఫ్ సీజన్‌లో పుష్కలంగా వర్షాలు కురిసిన నేపథ్యంలో చెరువులు, కుంటలు నిండుకుండను తలపిస్తున్నా యి. ప్రస్తుతం యాసంగి సీజన్ ఆరంభమై రైతులు సాగుకు ఉపక్రమిస్తుండగా చెరువు నీటి పారకంపై ఆధారపడ్డ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చెరు వులు, కుంటల నిర్వహణను గతంలో నీరటి చూసుకునే వారు. కాగా బీఆర్‌ఎస్ సర్కారు వీఆర్‌ఏలుగా ఉన్న నీరటి పోస్టులను ఇతర శాఖలకు బదలాయిం చడంతో ప్రస్తుతం వాటి నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. నీరటి స్థానంలో ప్రభుత్వం ప్రత్నామ్నాయంగా ఎవరినీ నియమించకపోవడం వల్ల చెరువు నీటిని వినియోగించుకోవడం ఎలా అనేది రైతాంగం సందిగ్ధంలో పడిపోయారు.

● తూముల నుంచి నీటి విడుదల ఎలా...

మండలంలో 16 చెరువులు ఉండగా 7687 ఎకరాల విస్తీర్ణంలో సాగుకు వినియోగిస్తున్నారు. 58 కుంటలు 1630 ఎకరాల మేర సాగుకు ఉపయోగపడు తున్నాయి. అయితే చెరువులు, కుంటలకు ఉన్న తూములు కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి నుంచి తరచూ నీరు లీకేజీ అవుతుండడంతో కొద్ది రోజుల్లోనే ఖాళీ అవుతున్నాయి. తూముల నుంచి నీటి విడుదల, తూముల ధ్వంసం, లీకేజీల వంటి సమస్యలు నీరటి ఎప్పటికప్పుడు సమాచారం ఇరిగేషన్ అధికారులకు చేరవేస్తుండే వారు. ప్రస్తుతం చెరువులు, కుంటలకు సంబంధించిన సమాచారం అధికారులకు చేరవేసే వారు లేకపోవడం వల్ల పారకానికి నీరు ఎవరు వదులుతారనే ఆందోళన రైతాంగం వెలిబుచ్చుతున్నారు. రాళ్లవాగు, బొమ్మెన ప్రాజెక్ట్, సూరమ్మ రిజర్వాయర్, గంభీర్‌పూర్ తాళ్ల చెరువు ప్రాజెక్ట్ నుంచి నీటిని వినియోగించుకోవడంపై నీలి నీడలు కమ్ముకున్నాయి. అంతేకాకుండా తరచూ చెరువుల్లో లీకేజీలు ఉంటే చెరువులు ఎండిపోయి మత్స్య సంపదకు కూడా నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. రబీ పంటల సాగుకు రైతాంగం సిద్ధమవుతున్న క్రమంలో ప్రభుత్వం చెరువులు, కుంటల నుంచి నీటిని విడుదల చేసేందుకు సిబ్బందిని వెంటనే నియమించాలని రైతులు కోరుతున్నారు.



తాండ్య్రాల ఊర చెరువు

బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక పోటీలు

జగిత్యాల క్రైం, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక పోటీలను జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అండర్ 14, 17 విభాగాల్లో ప్రతిభ చూపిన బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఈ నెల 29న నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులు ప్రాథినిత్యం వహించనున్నట్లు జిల్లా క్రీడల కార్యదర్శి లక్ష్మి రామ్ నాయక్ పేర్కొన్నారు. ఈ నిర్వాహణలో పేట అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, పీడీలు నిరంజన్, కృష్ణ ప్రసాద్, అజయ్ బాబు, మల్లేశ్వరి, వెంకట్, లక్ష్మి సాగర్, వేణు, కోటేశ్వర్ రావు, ప్రశాంత్, కిషోర్ ఉన్నారు.

అంజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్

మల్యాల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదివారం కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన విప్‌కు దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించగా ఈవో రామకృష్ణరావు శేషవస్త్రాలతో సత్కరించారు. అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్, చంద్రశేఖర్, ఉమామహేశ్వర్ ఉన్నారు.

గంగుల కమలాకర్‌ను పరామర్శించిన జువ్వాడి

కోరుట్ల, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి కరీంనగర్ శాసన సభ్యుడు గంగుల కమలాకర్‌ను ఆదివారం కోరుట్ల సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. ఇటీవల గంగుల కమలాకర్ మాతృమూర్తి మృతి చెందంగా ఆమె చిత్ర పటానికి నివాళులు అర్పించి సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన విష్ణు సహస్రనామ పారాయణం

ధర్మపురి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):. ధర్మపురిలో చేపట్టిన విష్ణు సహస్ర నామ పారాయణం ఆదివారం ముగిసింది. లోక కళ్యాణం కోసం ఏడు ఏళ్లుగా చేపట్టిన కోటి విష్ణు నామాలను స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారికి సమర్పించి ముగించారు. సీతారామ సత్సంగ్ భజనా మండలి ఆధ్వర్యంలో నిర్వహించగా పలువురు మహిళలు ప్రధాన వీధుల గుండా బయలు దేరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి చేరుకున్నారు. వేదపండితులు, అర్చకులు సమక్షంలో మహిళలు విష్ణు సహస్ర నామ పారాయణాన్ని సమర్పించి ముగించారు.

ఉద్యమకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

జగిత్యాల అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల భూమి ఇవ్వాలని ఉద్యమకారుల ఫోరం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు జవ్వాజి శంకర్ డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు రూ.25 వేల పింఛన్‌తో పాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్లల్లో 10 శాతం ఇళ్లను ఉద్యమకారులకు కేటాయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జగిత్యాల నియోజకవర్గ అధ్యక్షుడు కొండ్ర ప్రేమ్ కుమార్, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కొడిమ్యాల, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన కొత్తూరి సురేందర్, గుమ్మడిదారి రాజేశం ఇటీవల మృతి చెందగా మృతుల కుటుంబ సభ్యులను ఆదివారం సాయంత్రం చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం పరామర్శించారు. ఎమ్మెల్యే మృతుల కుటుంబ సభ్యులకు 10 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్ రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

ప్రతీ ఇంట్లో దీపావళి జ్ఞానజ్యోతి వెలుగులు వెలగాలి

గొల్లపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : హిందువుల పవిత్ర పండగ అయిన దీపావళి పర్వదినంను పురస్కరించుకుని ప్రతి ఇంటిలో దీపావళి జ్ఞాన జ్యోతి వెలుగులు వెలగాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక లక్షెటిపేట్, కొడిమ్యాల కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం గొల్లపల్లి మండం లొత్తునూర్ గ్రామంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక ఆయా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక లక్షెటి పేట్, కొడిమ్యాల కమిటీ అధ్యక్షులు ఆర్. రాజు, రాకేష్, ఎం. రాజు, రాజు రవి, సునీత, సాహిత్, అనేతేజ్, వేణుగోపాల్, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పుట్టపాక సత్తయ్య పాల్గొన్నారు.

పద్మశాలి సేవ సంఘం అధ్యక్షుడిగా సుధీర్‌కుమార్

ధర్మపురి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడిగా కొంక సుధీర్‌కుమార్ ఎన్నికయ్యారు. స్థానిక మార్కండేయ స్వామి దేవాలయం ఆవరణలో పద్మశాలి సేవా సంఘం సభ్యులు ఆదివారం సమావేశం నిర్వహించారు. అధ్యక్ష పదవి కోసం కొంక సుధీర్‌కుమార్, గుడ్ల రవీందర్ పోటీపడగా ఇందులో కొంక సుధీర్‌కుమార్ 13 ఓట్లతో గెలుపొందారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా బోగ మల్లేష్, ఉపాధ్యక్షులుగా వెలగందుల అనిల్, కోశాధికారిగా బైరి మల్లేష్, సంయుక్త కార్యదర్శిగా బూర్ల సుమన్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు అభినందించారు.

జిల్లా గెజిటెడ్ ఉపాధ్యాయుల కార్యవర్గం

జగిత్యాల అర్బన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కార్య వర్గం ఎన్నికలు ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు భానుచంద్రప్రకాశ్ నేతృత్వంలో జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా జె.గంగనర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎం.బన్నా, కోశాధికారిగా రవీందర్, జిల్లా కౌన్సిలింగ్ సభ్యులుగా నీరజ, కిషన్, నరేందర్‌లు ఎంపికైనట్లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన పీఎం షేక్, శ్రీనివాస్ రెడ్డిలు ప్రకటించారు.